## క్లుప్తంగా

### సమస్యల పరిష్కారానికే కమిటీ ఏర్పాటు



సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

మాకవరపాలెం : దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు మండల లెవిల్ కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసినట్టు ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పలు వివాదాలకు సంబంధించి ఇరువర్గాలతో శనివారం కమిటీ చర్చించింది. ఈ సందర్భంగా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎస్ఐ దామోదర్‌నాయుడు, విద్యుత్, హౌసింగ్ శాఖల ఏఈలు బాలకృష్ణ, రమణ పాల్గొన్నారు.

### పిచ్చి మొక్కల తొలగింపు

నర్సీపట్నం : గురందరపాలెం రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదాలకు నిలయంగా మారాయి. పిచ్చి మొక్కలు తొలగింపునకు పంచాయతీ రాజ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామసర్పంచ్ శానపతి వెంకటరత్నం చొరవ చూపారు. శనివారం కూలీలను పెట్టి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగింపజేశారు. దీంతో ఆ రోడ్డున వెళ్లే వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

### పీఎం మోదీ సభను విజయవంతం చేయాలి

మాడుగుల : ఈ నెల 8వ తేదీన ఉమ్మడి విశాఖలో జరగనున్న సభకు ప్రధాని మోదీ రానున్నారని, ఈ సభను విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీవోఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సభకు గ్రామాల్లో ప్రజలను తరలించడానికి కృషి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### స్వచ్ఛందంగా పారిశుధ్య పనులు



వారాడలో స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి సరోజిని

కె.కోటపాడు : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు లెక్కల నాగ విజయలక్ష్మి, సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య అన్నారు. వారాడ గ్రామంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పనులను గ్రామ పంచాయతీ అధికారులు, గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సరోజిని,ఉప సర్పంచ్ గోవింద పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : పి. భీమవరం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రతి శనివారం సంపూర్ణ పారిశుధ్యం పనుల్లో భాగంగా ఎంపీడీవో విజయలక్ష్మి తమ సిబ్బందితో వీధుల్లో తుప్పలు, చెత్తా చెదారం తొలగించి కాలువల్లో పూడికలు తీయించారు.

### పాఠశాల స్థలం ఆక్రమణపై విచారణ



ఆక్రమణదారులను విచారిస్తున్న స్పెషలాఫీసర్ వంతరావు, తహసీల్దార్ వెంకటరమణ

చోడవరం : పాఠశాల స్థలం ఆక్రమణకు సంబంధించి అధికారులు శనివారం విచారణ చేపట్టారు. రావికమతం మండలం అప్పలమ్మపాలెం ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణకు గురైనట్టు అధికారులకు స్థానికులు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పెషలాఫీసర్ వసంతరావు, తహసీల్దార్ బి.వెంకటరమణ, ఎంపీడీవో వెంకన్నబాబు విచారణ చేపట్టారు. ఆక్రమణలు తొలగించాలని, ఆక్రమణదారులకు అధికారులు ఆదేశించారు.

ఆక్రమణల సమస్య పరిష్కారం అయ్యే వరకూ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన బిల్లులు నిలిపివేయాలని ఉన్నతాధికారులను కోరామని స్పెషలాఫీసర్ తెలిపారు. ఈ విచారణ సమయంలో ఎంఈవో హాజరుకాకపోవడంపై విమర్శలు చోటు చేసుకున్నాయి.ఉపసర్పంచ్ భాస్కర రావు, సత్తిబాబు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రంలో సమస్యల తిష్ట

- రెండు నియోజకవర్గాల ప్రజలకు ఆదరువుగా మాడుగుల సామాజిక ఆరోగ్య కేంద్రం
- బ్లడ్‌బ్యాంక్, అంబులెన్స్ సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో రోగులు, గర్భిణులకు ఇబ్బందులు
- అసంపూర్తిగా నిల్చిన ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం
- సోమ, గురువారాల్లో అధిక సంఖ్యలో ఓపీ



మాడుగుల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం



ఆస్పత్రిలో వైద్య సేవల కోసం వచ్చిన రోగులు, గర్భిణులు

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రభుత్వ 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో సతమతమవుతుంది. ఈ ఆస్పత్రి మాడుగుల, చీడికాడ మండలాలతో పాటు పాడేరు మండలంలో గల పలు గిరిజన గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తుంది. ప్రతి సోమ, గురువారాల్లో ఆస్పత్రికి 150 నుంచి 200 మంది వరకు రోగులు వస్తుంటారు. వీరితో పాటు గర్భిణులు, అత్యవసర వైద్య సేవలు పొందేవారితో పాటు ప్రమాదాలకు గురైన వారు పాముకాటు, కుక్కకాటు బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. మిగిలిన రోజుల్లో 100 నుంచి 120 మంది వరకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ ఏడుగురు వైద్యులు మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు. దంత వైద్యులతో పాటు ఫిజియోథెరపీ వైద్యులు లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగురు స్టాఫ్ నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. వీరి సంఖ్య 15 మంది వరకు ఉండాలి. ఆస్పత్రిలో వున్న మూడు వార్డుల్లో గల 30 పడకలలో జ్వరం, డయేరియా, ఇతర వ్యాధుల బారిన పడిన వారితో పాటు గర్భిణులు చికిత్స పొందుతున్నారు. గర్భిణులకు తప్పని పరిస్థితుల్లో సిజేరియన్ చేయడానికి ఆపరేషన్ థియేటర్ ఉన్నా అత్యవసర సమయంలో బ్లడ్ స్టోరేజ్ చేసుకోవడానికి అవకాశం లేదు. జనరేటర్ కూడా సక్రమంగా పని చేయడం లేదు. అంబులెన్స్ లేక అత్యవసర సమయంలో రోగులను అనకాపల్లి, విశాఖపట్నం తరలించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని రూమ్‌ల్లో శ్లాబ్ పగిలిపోయింది. ల్యాబ్ రూమ్ శ్లాబ్ కూడా శిథిలావస్థకు చేరింది.

**అసంపూర్తిగా ఆస్పత్రి భవన నిర్మాణం**

ఆస్పత్రికి పక్కా భవన నిర్మాణాలు చేపట్టినా అసంపూర్తిగా నిల్చిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఎంఎస్ఐ పథకంలో భవన సముదాయ నిర్మాణానికి రూ.5.29 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో 70 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అనివార్య కారణాల వల్ల సంబంధిత గుత్తేదారు పనులు నిలుపుదల చేశారు. గత నెల ఆఖరి వారంలో మాడుగుల వచ్చిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఖాళీ పోస్టులు, జనరేటర్ ఏర్పాటు గురించి, అంబులెన్స్ ఏర్పాటు తదితర విషయాలపై ఆస్పత్రి ప్రధాన వైద్యుడు బి. చంద్రశేఖర్ కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న ఆస్పత్రి భవనాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ ఏడాది మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

**శానిటేషన్ వర్కర్లకు జీతాలు పెంచాలి**

ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు జీతాలు పెంచాలని కోరుతున్నారు. ఆస్పత్రిలో ఏడుగురు వర్కర్స్, ఒక సూపర్‌వైజరు పనిచేస్తున్నారు. వీరికి ప్రతి నెలా రూ.9వేలు జీతం అందిస్తున్నారు. వీరిని 2017 జనవరి నెలలో అప్పటి ప్రభుత్వం నియమించింది. వీరికి జీతం పెంపుదల చేయాలని కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపాం**

రోగులకు అన్ని సదుపాయాలు కల్పిస్తాం. ప్రతి రోజు ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి సూచనలు అందిస్తున్నాం. ఖాళీగా వున్న పోస్టుల గురించి ఏపీ వైద్య విధాన పరిషత్‌కు ప్రతిపాదించాం. స్టాఫ్ నర్స్ పోస్టులు ఇంకా అవసరం ఉంది. ఇటీవల ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్‌కు సమస్యలు వివరించాం. –బి.చంద్రశేఖర్, ఆస్పత్రి ప్రధాన వైద్యుడు, మాడుగుల

**బ్లడ్‌బ్యాంకు అవసరం**



ఆస్పత్రికి బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలి. అత్యవసర సమయంలో రోగులను విశాఖ, తదితర చోట్లకు తరలించేందుకు వీలుగా అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఎక్స్‌రే పూర్తి స్థాయిలో అందరికీ అందుబాటులో ఉంచాలి. జనరేటర్ సౌకర్యం పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి. –పాలిమేర విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు, మాడుగుల

**స్కానింగ్ పరికరాలు లేవు**



ఆస్పత్రిలో అన్ని రకాలు స్కానింగ్‌లు, ఎక్స్‌రేలు అందుబాటులో ఉంచాలి. రోగులకు అందించే ఆహారం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. స్కానింగ్‌లు ఇక్కడ లేకపోవడం వల్ల అనకాపల్లి, ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయడం వల్ల రోగులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. –ఇ. నర్సింహమూర్తి, సీపీఎం మండల కార్యదర్శి, మాడుగుల

### సూదివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : శ్వాసకోశ సంబంధిత వ్యాధిగ్రస్తులు శీతాకాలం సమయంలో ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. సూదివలసలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 117 మందికి వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందించారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపిన వైద్యాధికారి శైలజ ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చన్నారు. హెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ విజయ, ఏఎన్‌ఎం అనురాధ పాల్గొన్నారు.

### మోదమాంబ ఆలయానికి వెండి విరాళం

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి దాతలు శనివారం సాయంత్రం వెండి బహూకరించారు. గ్రామానికి చెందిన శానాపతి దుర్గునాయుడు, పద్మ దంపతులు ఆర్థిక సహకారంతో పావు కిలో వెండిని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## పంతాలు పట్టింపులతో సమస్య పరిష్కారం కాదు



పీజీఆర్ఎస్ పరిష్కార వేదికలో సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష

నాతవరం : చిన్న చిన్న సమస్యలకు పంతాలు పట్టింపులకు పోవడం వల్ల అవి పరిష్కారం కావని మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష అన్నారు. ఆమె శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా అర్జీదారులతో విడివిడి సమావేశమై వారి సమస్యపై క్షేత్ర స్థాయిలో ఉన్న దానికి, రికార్డులకు పొంతన లేకపోవడాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఇరువర్గాలు సర్దుకుపోతే తీరిపోయే సమస్యపై పరిష్కారానికి ఆసక్తి చూపకుండా రచ్చ చేసుకుంటున్నారని అన్నారు. కుటుంబ సభ్యుల మధ్య భూ పంపకాలు, సరిహద్దుల సమస్యలపైనే ఫిర్యాదులు అధికంగా ఉంటున్నాయన్నారు. ఇటీవల భూముల రేట్లు పెరగడంతో చిన్న సమస్యను సైతం పెద్దగా భావించి కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. అర్జీలపై నిబంధనల ప్రకారం రికార్డులను అనుసరించి పలువురికి సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్ ఎంపీడీవో కె.ఉషాశ్రీ , ఎస్ఐ భీమరాజు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటిండెంట్ పార్థసారథి పాల్గొన్నారు.

## సృజనాత్మక విద్యపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త చంద్ర

మాడుగుల రూరల్ : ప్రతి నెలా 5 వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సృజనాత్మక విద్యపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల 5వ తేదీ ఆదివారం రావడంతో కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పి.చంద్ర ఒక రోజు ముందుగా శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు సృజనాత్మక విద్య, అంగడిలో అమ్మకాల గురించి వివరించారు. మూడేళ్ల వయసు చిన్నారులకు పిపిఓ 1 పుస్తకాల గురించి, నాలుగేళ్ల వయసు దాటిన చిన్నారులకు పీపీ 2 పుస్తకాలు గురించి తెలిపారు.

## ఇంటర్ విద్యార్థులకు 'మధ్యాహ్న భోజనం' ప్రారంభం



మాడుగుల జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు



చోడవరంలో విద్యార్థులతో కలసి ఎమ్మెల్యే రాజు, అధికారుల సహపంక్తి భోజనం



చీడికాడలో ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి



దేవరాపల్లిలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం

మాడుగుల : స్థానిక కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శనివారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మాడుగులలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ రమాదేవి, కూటమి నాయకులు అప్పలరాజు, దేముడు, సత్యనారాయణ, పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌లో శనివారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఇంటర్ విద్యార్థులకు భోజనం ఇంటి వద్ద నుంచి తెచ్చుకునే ఇబ్బంది తీరిందన్నారు.

చోడవరం రూరల్: ఇంటర్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనాన్ని అందించడం జరుగుతుందని, దీనికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా నామకరణం చేయడం విశేషమని చోడవరం శాసనసభ్యుడు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు కొనియాడారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమారాణి, ఎంపీడీవోఆంజనేయులు, మండల విద్యాధికారి కె.సింహాచలం, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, పూర్వ జెడ్పీటీసీ మత్స్యరాజు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్నారు. కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారం అందనుందన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి, రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం ప్రారంభించారు. కళాశాల ఆవరణలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులతో కలిసి వంటలను రుచి చూశారు. దేవరాపల్లిలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని పలువురు విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాభవానీ, మాజీ ఎంపీపీ రాజేశ్వరి, ఎంపీటీసీ కృష్ణమూర్తి, మండల విద్యాశాఖ అధికారి బి.పడాల్‌దాస్, కళాశాల ప్రిన్సిపాల్ బి.రాధ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాకవరపాలెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి రామ్మోహన్ రావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో మూర్తి, ఉప సర్పంచ్ రాము పాల్గొని విద్యార్థులకు భోజనం అందించారు.

## అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ



దేవరాపల్లి భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ గొప్పతనాన్ని వివరిస్తున్న ఎంఈవో పడాల్‌దాస్





తూటిపాలలో బ్రెయిలీ దినోత్సవం

దేవరాపల్లి : అంధులకు అక్షర జ్ఞానాన్ని అందించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని మండల విద్యాశాఖ అధికారి బి.పడాల్‌దాస్ కొనియాడారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి మండల విద్యాశాఖ అధికారి బి.పడాల్‌దాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసనాయుడు, ఉపాధ్యాయుడు కృష్ణ స్వామినాయుడు, భవిత కేంద్రం సిబ్బంది అప్పలనాయుడు, గాయత్రి పాల్గొన్నారు.

మాకవరపాలెం : స్థానిక భవిత కేంద్రంతోపాటు, తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. లూయి బ్రెయిలీ చిత్రపటానికి ఎంఈవో మూర్తి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో మాట్లాడుతూ అంధుల కోసం లూయి బ్రెయిలీ లిపిని తయారు చేసి అక్షర జ్ఞానాన్ని అందించాడన్నారు. భవిత కేంద్రం ఇన్‌చార్జి మంగ, తూటిపాల హెచ్‌ఎం రాము పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని మండల విద్యాధికారి కె.సింహాచలం కొనియాడారు. శనివారం చోడవరం జడ్పీ బాలికోన్నత పాఠశాల కాంప్లెక్సులోని భవిత విద్యా కేంద్రం వద్ద లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. బ్రెయిలీ, ఆడమ్స్ హెలెన్ కెల్లర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంధుల ఉపయోగార్థం చుక్కలతో కూడిన ప్రత్యేక లిపిని తయారు చేయడం ద్వారా వారు విద్య నేర్చుకునే వీలు కల్పించారన్నారు. జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.వి.రమణి, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు కె.సత్యనారాయణ, సీఆర్ఎంటి మహాలక్ష్మినాయుడు, రవిశంకర్ పాల్గొన్నారు.

## సంపద కేంద్రాలపై శ్రద్ధ చూపండి



జి.గంగవరంలో పర్యటిస్తున్న ప్రత్యేకాధికారి రామ్మోహనరావు

మాకవరపాలెం : చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జి.గంగవరం, కొండల అగ్రహారం, జి.నగరం, పైడిపాల గ్రామాల్లో శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన చెత్త తొలగింపు పనుల్లో ఎంపీడీవో సీతామహాలక్ష్మితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. లచ్చన్నపాలెంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సమైక్యంగా పనిచేస్తే ఫలితాలు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ, ఎంఈవో-2 వరహాలబాబు

నాతవరం : పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు సమష్టిగా పని చేస్తేనే ఆశించిన స్థాయిలో పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ఎంఈవోలు ఒ.సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతినెలా విధిగా యాజమాన్య కమిటీలు సమావేశం నిర్వహించి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఐక్యంగా లోపాలను సరి చేసుకుంటూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

## ప్రభుత్వోద్యోగులుగా గుర్తించండి



వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

బుచ్చెయ్యపేట : ప్రభుత్వ కాలేజీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులైజ్ చేసి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజును కోరారు. శనివారం వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన కాంట్రాక్ట్ లెక్చరర్లు నరసింహమూర్తి, కె.సునీత,ఎస్. ముత్యాలమ్మ, బి. శ్రీనివాసరాజు, జె.సుధీర్ వినతి పత్రం అందించారు. హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతయ్యబాబు, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో గ్రామాభివృద్ధి

దేవరాపల్లి: గ్రామ ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతుగా కృషి చేస్తున్నానని బోయిలకింతాడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ బూరె బాబురావు అధ్యక్షతన శనివారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సలహాలు, సూచనలతో పాటు సమస్యలను గ్రామ సభ దృష్టికి వచ్చారు. పంచాయితీకి ఆదాయం చేకూర్చేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సర్పంచ్ కోరారు. పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సమష్టి కృషి అవసరం



చిన్నారులు నిర్వహించిన కూరగాయల మార్కెట్ స్టాల్‌ను పరిశీలిస్తున్న సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం : మున్సిపాలిటీ 15వ వార్డు పెదబొడ్డేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త మాట్లాడుతూ చిన్నారులను విలువలు, వ్యక్తిత్వ వికాసంతో పెంచాలన్నారు. పిల్లలకు చదువు చెప్పే ప్రక్రియలో తీసుకురావాల్సిన సంస్కరణలను బోధన పద్ధతులతో అనుసంధానం చేసే క్రమంలో తల్లిదండ్రుల సూచనలు చాలా కీలకమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు రంగవల్లు వంటి వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు వార్డు ఇన్‌ఛార్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.

## తాగునీటిని పరీక్షించాలి

చీడికాడ : అర్జునగిరిలో శనివారం ఉదయం మండల ప్రత్యేకాధికారి కె.ఎల్.ఎన్.మూర్తి పర్యటించారు. ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రమాదేవి, ఎంపీడీవో హేమసుందర్‌తో కలిసి ఎస్సీ కాలనీ, ఓసి కాలనీ, బీసీ కాలనీ,రామాలయం వీధిల్లో పర్యటించారు. మురుగు కాలువలు లేని ప్రదేశాలను పరిశీలించి పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. ఎంపీటీసీ అమ్మతల్లినాయుడు, గ్రామస్తులు ప్రసాద్, గణపతి, కిరణ్, జె.వి.రమణ తదితరులు మాట్లాడుతూ గ్రామంలో సరఫరా అవుతున్న తాగునీరు వల్ల కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని నీటిని పరీక్షించి సమస్య ఉన్నట్టయితే వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో గంగరాజు పాల్గొన్నారు.

## తులసీరావుకు ఘన నివాళి



తులసీరావు చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న బాబూరావు

దేవరాపల్లి: బోయిలకింతాడ విశాఖ డెయిరీ పాల సమీకరణ కేంద్రంలో డెయిరీ పూర్వపు చైర్మన్ దివంగత ఆదారి తులసీరావు వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తులసీరావు చిత్రపటానికి స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తులసీరావు అందించిన సేవలను ఆయన స్మరించుకున్నారు. పాల సొసైటీ అధ్యక్షుడు దాసరి వెంకటరమణ, పడిడెకల రామునాయుడు, పెంటకోట అప్పలనాయుడు, కొప్పు ఈశ్వరమ్మ, గ్రామ పెద్దలు అన్నం వెంకటరావు, శనివాడ రాజు, సోమునాయుడు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సుందరి, ట్రస్టు సభ్యులు

దేవరాపల్లి : కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు స్టడీ మెటీరియల్ వితరణ చేశారు. కాశీపురం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు బీటీటీ సుందరి సమక్షంలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న 14 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివి టెన్త్‌లో శత శాతం మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రస్ట్ సభ్యులుదివాకర్, కర్రి దార ప్రసాద్, పూజ, యడ్ల స్వాతి పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

నా క్లయింటు కాళ్ళ సత్తిబాబు, S/o. లేటు కొండ, ఏటిగైరంపేట గ్రామం, గొలుగొండ మండలం, అనకాపల్లి జిల్లా ఇచ్చిన భోగట్టా పైన ఈ ప్రకటన. నా క్లయింటు తేదీ: 25-11-2024న ఏటిగైరంపేట గ్రామంనుండి గొలుగొండ వెళ్తుండగా, యలమర్తి పరమేశ్వరరావు ద్వారా నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయము నందు రిజిస్టర్ కాబడినటువంటి డాక్యుమెంట్ నెంబర్ 1922/2003, విస్తీర్ణం 74 చ॥గ॥లు గల సదరు ఒరిజినల్ డాక్యుమెంటు ఏటిగైరంపేట గ్రామం నుండి గొలుగొండ గ్రామం మధ్యలో పడిపోయినది. కావున ఎవరికైనా సదరు ఒరిజినల్ డాక్యుమెంటు దొరికిన యెడల వారం రోజులలోగా ఈ క్రింది అడ్రస్‌కు అప్పగించవలసినదిగా కోరుచున్నాను. లేని యెడల పైన డాక్యుమెంటు నిమిత్తం తగిన చర్యలు తీసుకొనబడును.

KOSURU APPALANAIDU, B.A., L.L.B.,
Advocate
Tamaram Village, Makavarapalem (Md.),
Anakapalli (Dist.,), Cell: 94404 12788

## పాతవలసలో రెవెన్యూ సదస్సు

కె.కోటపాడు : పాతవలసలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆరుగురు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అర్జీలను అందించారు. ప్రతి అర్జీదారుని భూ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కారాన్ని చూపే చర్యలను తీసుకోనున్నట్టు మండల సర్వేయర్ రామచంద్రమూర్తి తెలిపారు.